

సమావేశంలో మాట్లాడుతున్న ఉపాధ్యాయులు

## పెండింగ్ డీఏలు విడుదల చేయాలి

గణపురం, మార్చి 16 : రాష్ట్రంలోని ఉపాధ్యాయ, ఉద్యోగులకు రావాల్సిన పెండింగ్ డీఏలు విడుదల చేసి, నూతన పీఆర్సీని వెంటనే ప్రకటించాలని డీటీఎఫ్ నాయకులు డిమాండ్ చేశారు. ఆదివారం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో మండల ప్రధాన కార్యదర్శి చేరాల రాంబాబు అధ్యక్షతన సర్వ సభ్య సమావేశం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా జిల్లా అధ్యక్షుడు రమణారెడ్డి హాజరై మాట్లాడుతూ సీపీఎస్‌ను రద్దుచేసి, పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలన్నారు. ఎనికల ముందు కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలను అమలు చేయాలన్నారు. పాఠశాలల్లో మౌలిక వసతులు కల్పించి, విద్యార్థులకు నాణ్యమైన విద్య అందేలా చూడాలన్నారు. డీటీఎఫ్ జిల్లా కార్యదర్శి సామంతుల వీరన్న మాట్లాడుతూ పదో తరగతి పరీక్ష కేంద్రాల్లో విద్యార్థులు, ఇన్విజిలేటర్లకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు. అనంతరం డీటీఎఫ్ మండల నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. మండల అధ్యక్షుడిగా చేరాల రాంబాబు, ప్రధాన కార్యదర్శిగా ఆలోతు రాజు, ఉపాధ్యక్షులుగా పాశికంటి సురేందర్, ఆడేపు చంద్రకళ, ముక్కెర సుమలత, కార్యదర్శులుగా తిరుమల్ రెడ్డి, శివరాణి, సురేశ్ బాబు, జవేరియా, జిల్లా కౌన్సిలర్లుగా వెంకటేశ్వరాచారి, జయ లక్ష్మీరెడ్డి, ఆడిట్ కమిటీ కన్వీనర్‌గా సదానందం, సభ్యులుగా కండే సుస్మిత, గట్టు అనూషను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు ఎన్నికల అధికారి వీరన్న తెలిపారు. కాగా, అధ్యక్షుడిగా ఎన్నికైన చేరాల రాంబాబు తన ఎన్నికకు సహకరించిన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు తెలిపారు.



వధూవరులకు వస్త్రాలు అందజేస్తున్న మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి

## వధూవరులకు మాజీ ఎమ్మెల్యే ఆశీర్వాదం

కృష్ణకాలనీ, మార్చి 16 : భూపాలపల్లి మున్సిపల్ పరిధిలోని గడ్డిగానిపల్లికి చెందిన బీఆర్ఎస్ సీనియర్ నాయకులు సెగ్గం మలమ్మ-సమ్మయ్య దంపతుల కుమార్తె వివాహ వేడుకలు ఆదివారం జరిగాయి. భూపాలపల్లి మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి పాల్గొని వధూవరులకు పెండ్లి బట్టలు అందజేసి, ఆశీర్వదించారు. అలాగే, బీఆర్ఎస్ యూత్ నాయకుడు సేగ్గం దినేశ్ కూడా ఆశీర్వదించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ భూపాలపల్లి అర్బన్ అధ్యక్షుడు కటకం జనార్దన్ పటేల్, మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ సెగ్గం వెంకటరాణి సిద్ధు, స్థానిక బీఆర్ఎస్ నాయకులు మనోహర్ తదితరులు పాల్గొన్నారు.

చెరుకూరు, ధర్మవరం మధ్యలోని అడవిలో వ్యాపించిన మంటలు

## అడవిలో చెలరేగిన మంటలు

### కాలి బూడిదవుతున్న వృక్షాలు

వాజేడు, మార్చి 16 : మండలంలోని చెరుకూరు, ధర్మవరం గ్రామాల మధ్యలో ప్రధాన రహదారికి ఇరువైపుల అటవీప్రాంతంలో ఆదివారం మధ్యాహ్నం మంటలు చెలరేగాయి. ఈ మంటల్లో చిన్నచిన్న చెట్లు, వృక్షాలు కాలిపోయాయి. విషయం తెలుసుకున్న బేస్ క్యాంపు సిబ్బంది మంటలు ఆర్పివేశారు. కాగా, వేసవి కావడం, ఆకురాలే సమయంలో ఎవరైన చిన్నగా మంట పెట్టినా అడవిలో నిప్పు రగిలి విలువైన వృక్ష సంపద బుగ్గిపాలవుతుంది. అటవీశాఖ అధికారులు ఎప్పటికప్పుడు ఇలాంటి వాటిని గమనించి, అటవీ సంపదను కాపాడాలని స్థానికులు కోరుతున్నారు.

## 'నూతన ఎంపీటీసీ స్థానం ఏర్పాటు చేయాలి'

మహాముత్తారం, మార్చి 16 : మహాముత్తారం మండలంలోని మొత్తం 8 ఎంపీటీసీ స్థానాలు ఉండగా కొత్త ముత్తారం, పోలంపల్లి కలుపుకొని మరో నూతన ఎంపీటీసీ స్థానం ఏర్పాటు చేయాలని నేతకాని సంఘం రాష్ట్ర యువజన ప్రధాన కార్యదర్శి రాజబాబు కోరారు. రెండు గ్రామాల్లో దాదాపు 1500 ఓట్లు ఉన్నాయని, కొన్ని దశాబ్దాలుగా ఈ గ్రామాలకు ఎలాంటి రాజకీయ అవకాశం రాలేదని పేర్కొన్నారు. ఇప్పటికైనా నూతన ఎంపీటీసీ స్థానం ప్రకటించాలని ఒక ప్రకటనలో కోరారు.

ములుగురూరల్ : దీక్షలో నిరసన వ్యక్తం చేస్తున్న ఎమ్మార్పీఎస్, ఎమ్మెస్పీ నాయకులు

మహదేవపూర్ : ఎమ్మార్పీఎస్ నిరాహార దీక్షకు సంఘీభావం తెలుపుతున్న బీసీ సంఘ నాయకులు

# వర్గీకరణ అమలు చేయకుంటే తీవ్ర నష్టం

- ఎమ్మెస్పీ ములుగు జిల్లా అధ్యక్షుడు మడిపెల్లి శ్యాంబాబు
- ఎస్సీ వర్గీకరణ అమలు కోరుతూ నిరసన దీక్ష

ములుగురూరల్/మహదేవపూర్, మార్చి 16 : ఎస్సీ వర్గీకరణ అమలు చేయకపోతే గ్రూప్-1, గ్రూప్-2, గ్రూప్-3 నియామకాల్లో మాదిగలకు తీవ్ర నష్టం జరుగుతుందని ఎమ్మెస్పీ ములుగు జిల్లా అధ్యక్షుడు మడిపెల్లి శ్యాంబాబు, ఉపాధ్యక్షుడు మరాఠీ రవీందర్ అన్నారు. ఎస్సీ వర్గీకరణ అమలు కోసం ములుగు కలెక్టరేట్ కార్యాలయ సమీపంలో చేపట్టిన నిరసన దీక్ష ఆదివారం 7వ రోజుకు చేరింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇటీవల ఎస్సీ వర్గీకరణ చేపట్టిన తర్వాత డీఎస్సీ చేపట్టి ఉంటే 1100 మందికి ఉద్యోగాలు వచ్చేవని, వర్గీకరణ చేయకుండా నియమకాలు చేపట్టగా కేవలం 400 వరకు మాత్రమే రాగా సుమారు 700 మందికి ఉద్యోగాలు రాలే దని ఆవేదన వ్యక్తం చేశారు. సీఎం రేవంత్‌రెడ్డి వర్గీకరణ అమలు అయ్యేంత వరకు నియమకాలను చేపట్టవద్ద న్నారు. లేని పక్షంలో మంద కృష్ణ మాదిగ ఆధ్వర్యంలో పోరాటాలు చేస్తామని హెచ్చరించారు. సమావేశంలో నాయకులు కోతి కార్తీక్, గడ్డం కుమార్, పెండెల సుకుమార్, సుందర్, అంబాల రాజ్‌కుమార్ పాల్గొన్నా రు. అలాగే, మహదేవపూర్ మండల కేంద్రంలో ఎమ్మా ర్పీఎస్ ఆధ్వర్యంలో చేపట్టిన నిరాహార దీక్షలు ఆరో రోజుకు చేరాయి. దీక్షలకు బీసీ సంఘం జిల్లా ఇన్‌చార్జి విజయగిరి సమ్మయ్య, మండల గంగపుత్ర సంఘం ప్రధాన కార్యదర్శి గరిగే రమేశ్ మద్దతు ప్రకటించి, సంఘీభావం తెలిపారు. ప్రభుత్వం స్పందించే వరకూ పోరాటం తప్పదన్నారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు బెల్లంపల్లి సురేశ్ మాదిగ, మంథెన రవితేజ, వెముునూరి జక్కయ్య, చకినారపు తారా చందు, కన్నూరి గట్టయ్య, లింగాల సమ్మయ్య, చింతకుంట్ల సదానందం, ప్రభుకుమార్, బెల్లంపల్లి మల్లేశ్, లింగాల సుశాంత్ తదితరులు పాల్గొన్నారు.

స్వామి వారి ఉత్సవ విగ్రహాలకు చక్రవారి అభిషేకం చేస్తున్న అర్చకులు

## లక్ష్మీనరసింహస్వామి బ్రహ్మోత్సవాలు పరిసమాప్తం

రేగొండ, మార్చి 16 : మండలంలోని కొడవటంచ గ్రామంలో లక్ష్మీనరసింహస్వామి బ్రహ్మోత్సవాలు ఆదివారం రాత్రి అంగరంగ వైభవంగా పరిసమాప్తయ్యాయి. ఆలయంలో ఈ నెల 9నుంచి బ్రహ్మోత్సవాలు నిర్వహించారు. ఇందులో భాగంగా 10న స్వామి వారి కల్యాణం నిర్వహించగా 14 నుంచి మూడు రోజులపాటు ఉత్సవాలు చేపట్టారు. చివరి రోజు ఆదివారం రాత్రి స్వామి వారి నాగబలి(పుష్పయాగం)తో ఉత్సవాలు ముగించారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు లేకుండా నిర్వాహకులు ఏర్పాట్లు చేశారు. జాతర విజయవంతం చేసిన భక్తులు, అధికారులకు చైర్మన్ ముల్కనూరి భిక్షపతి, ఈవో మహేశ్‌కుమార్, ధర్మకర్తలు కృతజ్ఞతలు తెలిపారు. జాతరలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరుగకుండా చిట్యాల సీఐ మల్లేశ్‌యాదవ్, రేగొండ ఎస్సై సందీప్‌కుమార్ భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు.

## 'ప్రజావాణి'ని సద్వినియోగం చేసుకోవాలి

గణపురం/మల్హర్/కాటారం, మార్చి 16 : తహసీల్దార్ కార్యాలయాల్లో సోమవారం నిర్వహించనున్న ప్రజావాణి కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని గణపురం, మల్హర్, కాటారం తహసీల్దార్లు మధురకవి సత్యనారాయణ, రవికుమార్, నాగరాజు ఆదివారం వేర్వేరు ప్రకటనల్లో తెలిపారు. కలెక్టర్ ఆదేశాల మేరకు ప్రతి సోమవారం ప్రజావాణి నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. అన్నిశాఖల అధికారులు అందుబాటులో ఉంటారని తెలిపారు. ప్రజలు, రైతులు తమ సమస్యలపై ఉదయం 10:30నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు వినతులు అందజేయవచ్చని సూచించారు.

## 'అమాయకులను అరెస్టు చేయడం సరికాదు'

మహాముత్తారం, మార్చి 17 : మధ్యప్రదేశ్ నుంచి జీరో మద్యాన్ని మహాముత్తారం మారుమూల అటవీ గ్రామాలకు సరఫరా చేస్తున్న ప్రధాన నిందితులను వదిలేసి, అమాయక గిరిజన ఆదివాసులపై ఎక్సైజ్ శాఖ అధికారులు కేసులు పెట్టడం సరికాదని సామాజిక సేవ యూత్ అధ్యక్షుడు రత్నం లక్ష్మణ్ అన్నారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ మండలంలో ఇటీవల జీరో మద్యాన్ని బెల్ట్ షాపులకు సరఫరా చేస్తున్న ప్రధాన నిందితుల పేర్లను అధికారులు మీడియా ముందు ప్రకటించాలన్నారు. మండలంలోని వైన్ షాపుల వర్కర్లే అక్రమంగా మద్యాన్ని సరఫరా చేస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయన్నారు. వారంలోపు ప్రధాన నిందితులను అరెస్ట్ చేసి శిక్షించకపోతే వైన్ షాపుల ఎదుట ఆందోళన చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో సామాజిక సేవ యూత్ ఉపాధ్యక్షుడు రాజారామ్, యూత్ సభ్యులు రఘు, తరుణ్, అంతర్గం లక్ష్మి రాజ్, రవికృష్ణ, శేఖర్, మంజునాథ్ పాల్గొన్నారు.

## సౌకర్యాల కల్పనలో ప్రభుత్వం విఫలం

మాట్లాడుతున్న సీపీఎం మండల కార్యదర్శి రఘుపతిరావు

వాజేడు, మార్చి 16 : గుడిసెలు వేసుకొని ఏడాదిన్నరగా నివాసం ఉంటున్న గుడిసెవాసులకు సౌకర్యలు కల్పించడంలో ప్రభుత్వం విఫలమైందని సీపీఎం మండల కార్యదర్శి కొప్పుల రఘుపతిరావు అన్నారు. మండలంలోని ఇప్పగూడెం గ్రామంలో మోడెం బాబురావు అధ్యక్షతన ఆదివారం నిర్వహించిన సమావేశంలో రఘుపతిరావు మాట్లాడారు. పేదలకు సౌకర్యలు కల్పించాలని డిమాండ్ చేస్తూ సోమవారం గుడిసెల కేంద్రం నుంచి ఏటూరునాగారం ఐటీడీఏ కార్యాలయం వరకు పెద్ద ఎత్తున్న గుడిసెవాసులతో కలిసి పాదయాత్ర చేపట్టనున్నట్లు తెలిపారు. అనంతరం ఐటీడీఏ పీవోకు వినతిపత్రం అందజేయనున్నట్లు పేర్కొన్నారు. ఈ పాదయాత్రకు సంఘీభావంగా సీపీఎం రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ హాజరు కానున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో గుడిసెవాసులతోపాటు పార్టీ కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో దామోదర్, రవీందర్, అశోక్, ప్రవీణ్ పాల్గొన్నారు.

కురుమ సంఘం జిల్లా నూతన అడహక్ కమిటీ సభ్యులు

## కురుమ సంఘం జిల్లా అడహక్ కమిటీ ఎన్నిక

కృష్ణకాలనీ, మార్చి 16 : భూపాలపల్లి జిల్లా కేంద్రంలోని బీరప్ప గుడి ఆవరణలో కురుమ సంఘం జిల్లా అడహక్ కమిటీని ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సంఘం జిల్లా నూతన అడహక్ కమిటీ సభ్యులుగా దయ్యల కిరణ్, కోరే సుధాకర్, కోరే కుమార స్వామి, ఇండ్ల రవి, కంబాల రాజయ్య, బుర్రి కుమారస్వామి, మధిర కొమురయ్య ఎన్నికయ్యారు. అలాగే, ఆయా మండలాలకు ఇన్‌చార్జిలను కూడా ఎన్నుకున్నారు. భూపాలపల్లి అర్బన్‌కు అమృత అశోక్, గణపురం మండలానికి బండారి నాగరాజు, అమృత శ్రీనివాస్, బండారి శంకర్, రేగొండ మండలానికి కడారి జనార్దన్, పైడిపెల్లి కృష్ణ, చిట్యాల మండలానికి దామెర సాంబయ్య, కంచు కుమారస్వామి, మొగుళ్లపల్లి మండలానికి గౌడ రవీందర్, రాస భిక్షపతి, ముదిగిరి రవి, టేకుమట్ల మండలానికి ఆరె రాజేందర్, కోరే చందు, భూపాలపల్లి రూరల్‌కు గౌడ రవి, అన్న అశోక్, మహాముత్తారం మండలానికి ఆరే చేరాలు, ఉమ్మల్ల సంతోష్, కాటారం మండలానికి బండి రమేశ్, సాన ప్రసాద్, గోరి కొత్తపల్లి మండలానికి కోరే ఆనందం, జగురు అశోక్, ఆరే రాజేందర్ ఎన్నికయ్యారు. కార్యక్రమంలో కురుమ కులస్తులు నీల రమేశ్, కంచు రాజేందర్, కెంచు లక్ష్మణ్, నవీన్ పాల్గొన్నారు.

శ్రీనివాస్ కుటుంబ సభ్యులతో మాట్లాడుతున్న లక్ష్మీ నర్సింహారావు

## మృతుల కుటుంబాలకు పరామర్శ

ఏటూరునాగారం, మార్చి 16 : మండలంలోని రొయ్యూరు బీఆర్ఎస్ గ్రామ కమిటీ అధ్యక్షుడు కుర్మ శ్రీనివాస్ తండ్రి సమ్మయ్య, శంకరాజుపల్లిలో ఆత్మూరి ఎల్లమ్మ ఇటీవల మృతిచెందారు. బాధిత కుటుంబాలను బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు కాకులమర్రి లక్ష్మీ నర్సింహారావు ఆదివారం పరామర్శించారు. మృతుల చిత్రపటాల వద్ద నివాళులర్పించారు. ఆయన వెంట పార్టీ మండల అధ్యక్షుడు గడ్డాసు నీల్‌కుమార్, నాయకులు తుమ్మ మల్లారెడ్డి, కాకులమర్రి ప్రదీప్‌కుమార్, తాడూరి రఘు, జిట్ట ఈశ్వర్, దేవులపల్లి సమ్మయ్య, కూనూరు చిరంజీవి, మెరుగు వెంకటేశ్వర్లు, కొండగొర్ల తిరుపతి ఉన్నారు.

## అదుపుతప్పిన కారు

పరకాల, మార్చి 16 : చిరు వ్యాపారుల పైకి కారు దూసుకెళ్లిన ఘటన పరకాలలో జరిగింది. పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో నిర్వహించిన హెల్త్ క్యాంపులో కొందరు పరీక్షలు చేయించుకుని కారులో తిరుగు ప్రయాణమయ్యారు. ఈ క్రమంలో జూనియర్ కళాశాల నుంచి బయటకు వెళ్తున్న క్రమంలో కారు అదుపుతప్పి చిరు వ్యాపారులపైకి దూసుకెళ్లింది. ఈ ఘటనలో ఎవరికీ ఎలాంటి గాయాలు కాలేదు.

## కారును ఢీకొన్న లారీ

భూపాలపల్లి రూరల్, మార్చి 16 : రోడ్డు క్రాస్ చేస్తున్న కారును లారీ ఢీకొన్న ఘటన భూపాలపల్లి పట్టణంలోని మంజూర్‌నగర్‌లో ఆదివారం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన కథనం ప్రకారం.. పట్టణంలోని వెంగళ రావు వెంచర్‌లో నివసిస్తున్న సమ్మయ్య తన కారులో భూపాలపల్లికి వస్తూ మంజూర్‌నగర్ వద్ద రోడ్డు క్రాస్ చేస్తున్నాడు. ఈ సమయంలో అతివేగంగా వచ్చిన లారీ కారును ఢీకొనడంతో కారు ముందు భాగం ధ్వంసమైంది. కారులో ఉన్న సమ్మయ్యకు మాత్రం ఎలాంటి గాయాలు కాలేదు. లారీ డ్రైవర్ వెంటనే లారీ దిగి పారిపోయాడు. విషయం తెలుసుకున్న భూపాలపల్లి పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

## ఉరేసుకొని ఒకరి ఆత్మహత్య

రేగొండ, మార్చి 16 : ఆర్థిక ఇబ్బందులు భరించలేక ఉరి వేసుకొని ఒకరు ఆత్మహత్య చేసుకున్నారు. ఎస్సై సందీప్‌కుమార్ కథనం ప్రకారం.. రేగొండ మండలం రేపాక గ్రామానికి చెందిన చావటి లక్ష్మీనర్సయ్య(50) దినసరి కూలీగా పనిచేసేవాడు. ఆర్థిక ఇబ్బందుల కారణంగా ఆదివారం భర్యాభర్తల మధ్య గొడవ జరిగింది. దీంతో మనస్తాపానికి గురై ఆదివారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడికి భార్య ఇందిర, ఇద్దరు కూతుళ్లు ఉన్నారు. ఇందిర ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

## పెళ్లి కొడుకు ఫ్రెండ్స్ హంగామా

- భోజనం వద్ద పలువురిపై దాడి
- పోలీసులకు ఫిర్యాదు చేసిన బంధువులు

సంగెం, మార్చి 16 : వివాహం సందర్భంగా భోజనం వద్ద పెళ్లి కొడుకు స్నేహితులు హంగామా చేశారు. గొడవకు దిగి పలువురిపై దాడి చేశారు. పోలీసుల కథనం ప్రకారం.. భూపాలపల్లి జిల్లా ములుగు ఘణపురం మండలం గాంధీనగర్‌కు చెందిన కప్పల సంతోష్ కుమారుడు ప్రశాంత్‌సాయి వివాహం సంగెం మండలంలోని ఆశాలపల్లిలో ఆదివారం జరిగింది. భోజనాల సందర్భంగా పెళ్లి కుమారుడి మిత్రులు గొడవకు దిగారు. గమనించిన పెళ్లి కుమారుడి బాబాయ్ కప్పల శంకర్ వచ్చి ఎందుకు గొడవ పడుతున్నారని వారించాడు. దీంతో ఇల్లంద కొత్తగూడేనికి చెందిన సిదిరాల శ్రీకాంత్ తన మిత్రులతో కలిసి శంకర్‌పై కుర్చీలతో దాడి చేయగా, రక్తస్రావమైంది. అలాగే, పెళ్లి కుమారుడి తండ్రి కప్పల సంతోష్, ఆయన కుమార్తె అంబటి అంజుశ్రీని సైతం కుర్చీలతో కొట్టడంతో వారు కిందపడిపోయారు. దీంతో సిదిరాల శ్రీకాంత్, అతడి మిత్రులపై చర్యలు తీసుకోవాలని కోరుతూ కప్పల శంకర్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

## 'నేటి మహాసభలను జయప్రదం చేయాలి'

మల్హర్, మార్చి 16 : జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో సోమవారం జరుగనున్న భవన నిర్మాణ కార్మికుల యూనియన్(ఏఐటీయూసీ) జిల్లా మూడో మహాసభలను జయప్రదం చేయాలని సంఘం నాయకులు కోరారు. ఈ మేరకు కార్మికులతో కలిసి తాడిచర్ల గ్రామంలో కరపత్రాలు ఆవిష్కరించారు. కార్యక్రమంలో రాష్ట్ర కౌన్సిల్ మెంబర్ బందర్ లావణ్య, కుడుదుల వెంకటేశ్, ఆకుల శ్రీనివాస్, పీ శ్రీనివాస్, నారాయణ, టీ రమేశ్, ఈర్ల రవి, కుంట సతీశ్, శ్యామ్, వీ నరేశ్, పీ నర్సయ్య, పీ కిష్టయ్య, శ్రీధర్ రావు పాల్గొన్నారు.

## శతాధిక వృద్ధురాలి మృతి

ముక్లోత్ రాధ (ఫైల్)

మహాముత్తారం, మార్చి 17 : మండలంలోని ప్రేమ్‌నగర్‌కు చెందిన శతాధిక వృద్ధురాలు ముక్లోత్ రాధ శనివారం రాత్రి మృతి చెందారు. ఆమె వయస్సు 110 ఏళ్ల వరకు ఉంటుందని కుటుంబ సభ్యులు, గ్రామస్తులు తెలిపారు. రాధ భర్త లింగా నాయక్ కాగా, వీరికి ఐదుగురు కొడుకులు, ఒక కూతురు ఉన్నారు. ఆమె ఇప్పటికే ఐదు తరాలను చూసింది. జీవితాంతం ఆవులు మేపుతూ అడవిలోనే జీవనం సాగించింది. విశేషం ఏమిటంటే ఇన్నేళ్లలో ఆమెకు ఒక్క తెల్ల వెంట్రుక లేకపోవడం. కాగా, తల్లితోపాటు కొడుకులు, కూతురు కూడా ప్రతినెల పింఛన్ తీసుకోవడం గమనార్హం. ఆమె మృతికి ప్రజాప్రతినిధులు, గ్రామస్తులు, కుటుంబ సభ్యులు సంతాపం తెలిపారు.

## ఎదురెదురుగా ఢీకొన్న బైక్‌లు

### ఇద్దరికి గాయాలు

వాజేడు, మార్చి16 : ఎదురెదురుగా రెండు బైక్‌లు ఢీకొనడంతో ఇద్దరికి గాయాలైన ఘటన మండలంలోని గుమ్మడిదొడ్డి పంచాయతీ కార్యాలయం ఎదుట జాతీయ రహదారిపై ఆదివారం రాత్రి జరిగింది. గుమ్మడిదొడ్డి గ్రామానికి చెందిన ఇర్ప అభిషేక్, పద్దం రాంబాబు ఎదురెదురుగా బైక్‌లపై వస్తూ ఢీకొట్టుకున్నారు. దీంతో ఇద్దరు కిందపడి గాయపడ్డారు. అభిషేక్ తలకు తీవ్రగాయమై రక్తస్రావం కావడంతో ఏటూరునాగారం వైద్యశాలకు తరలించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం వరంగల్ ఎంజీఎం దవాఖానకు వైద్యులు రెఫర్ చేసినట్లు తెలిసింది. అలాగే, గాయపడిన రాంబాబును వాజేడు పీహెచ్‌సీకి తరలించి వైద్య చికిత్స అందిస్తున్నారు.

## దొంగ నోట్ల కలకలం!

నకిలీ రూ.200 నోట్లు

గణపురం, మార్చి 16 : మండలంలోని దొంగ నోట్ల చలామణి కలకలం రేపుతుంది. నకిలీ వంద, రెండు వందల రూపాయల నోట్లను మార్కెట్లోకి గుట్టు చప్పుడు కాకుండా చలామణి చేస్తున్నారు. తాజాగా మండల కేంద్రానికి చెందిన ఓ వ్యాపారికి నకిలీ 100, 200 రూపా యల నోటు ఇచ్చారు. ఆ డబ్బులను స్థానిక బ్యాంకులో జమ చేయ డానికి వెళ్లగా క్యాషియర్ గమనించి అది నకిలీ నోటని చింపినట్లు వ్యాపారి తెలిపాడు. అవి కాకుండా మరో రెండు నోట్లు వచ్చినట్లు బాధితుడు తెలిపాడు. కాగా, వరుసగా దొంగ నోట్లు రావడంపై మండ లంలో దొంగ నోట్ల చలామణి భారీగా జరుగుతున్నట్లు తెలుస్తోంది. గతంలో రూ.500 నోట్లు చలామణి జరిగేవి. ఈ క్రమంలో రూటు మార్చిన ముఠా రూ.100, రూ.200 నోట్లపై దృష్టి పెట్టి చెలామణి చేస్తున్నట్లు తెలుస్తున్నది. ధర్మరావుపేట, గణపురం, గాంధీనగర్ గ్రా మాల్లో దొంగ నోట్ల చెలామణి ఎక్కువగా ఉన్నట్లు తెలుస్తున్నది. చిరు వ్యాపారులకు రాత్రిపూట కొందరు కేటుగాళ్లు ఈ నకిలీ నోట్లు ఇస్తూ చెలామణి చేస్తున్నట్లు సమాచారం.

## జాతీయ స్థాయి టెన్నికాయిట్ పోటీలకు క్రీడాకారుల ఎంపిక

హనుమకొండ చౌరస్తా, మార్చి 16 : హనుమకొండ జవహర్‌లాల్ నెహ్రూ స్టేడియం(జేఎన్ఎస్)లో జరుగుతున్న తెలంగాణ 10వ రాష్ట్ర స్థాయి టెన్నికాయిట్ పురుషులు, మహిళల పోటీలు ముగిశాయి. ఈ నెల 25 నుంచి ఏప్రిల్ 1 వరకు ఒడి రాష్ట్రం భువనేశ్వర్‌లో జరిగే జాతీయ స్థాయి పోటీలకు క్రీడాకారులను ఎంపిక చేశామని, 16 జిల్లాల నుంచి 200 మంది క్రీడాకారులు ఈ పోటీల్లో పాల్గొని అత్యంత ప్రతిభ కనబర్చారని వరంగల్, హనుమకొండ జిల్లాల అధ్యక్షుడు బీఆర్ అంబేద్కర్, హనుమకొండ, వరంగల్ జిల్లాల కార్యదర్శులు అల్వాల రాజ్‌కుమార్, గోకారపు శ్యామ్‌కుమార్ తెలిపారు. పురుషుల విభాగంలో ఎండీ యాసిన్(మహబూబ్‌నగర్), సుజాయత్(మహబూబ్‌నగర్), డీ ప్రకాశ్(హనుమకొండ), జీ మధు(వరంగల్), మహిళల విభాగంలో జీ అఖిల(హనుమకొండ), బీ జ్యోతి(వరంగల్), జీ నవ్య(హనుమకొండ), జీ మమత(మహబూబ్‌నగర్) ఉన్నారు. ఈ ముగింపు కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా కుడా చైర్మన్ ఇనుగాల వెంకట్రామిరెడ్డి, మాజీ ఎంపీ పసునూరి దయాకర్ పాల్గొని విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. రాష్ట్ర టెన్నికాయిట్ కార్యదర్శి వెంకటేశ్, కోశాధికారి జహూర్, సీనియర్ క్రీడాకారులు ఎడ్ల సురేందర్ తదితరులు పాల్గొన్నారు.

## చిరునవ్వుతో సేవ చేయండి

### లయన్స్ అంతర్జాతీయ మాజీ డైరెక్టర్ రామకృష్ణమూర్తి

మడికొండ, మార్చి 16 : ప్రతి ఒక్కరూ చిరునవ్వుతో సేవ చేయాలని కోయంబత్తూరుకు చెందిన లయన్స్ అంతర్జాతీయ మాజీ డైరెక్టర్ రామకృష్ణమూర్తి సూచించారు. మడికొండలోని రెడ్డి కన్వెన్షన్ హాల్లో ఆదివారం 320 ఎఫ్ జిల్లా గవర్నర్ కుందూరు వెంకట్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన సమ్మేళనంలో ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. మల్టీపుల్ స్థాయిలో వరంగల్ ఉమ్మడి జిల్లాతో కూడిన 320ఎఫ్‌కు గొప్ప పేరుందని కొనియాడారు. వెంకట్‌రెడ్డి నాయకత్వంలో చారిట బుల్ కంటి ఆస్పత్రితో పాటు ఇతర అవసరార్థులకు నిర్వహించిన సేవలు వెలకట్టలేనివన్నారు. వెంకట్‌రెడ్డి మాట్లాడుతూ.. రిటెన్షన్లను మిన హాయిస్తే 600 మంది కొత్త సభ్యులు, 6నూతన క్లబ్‌లతో ఈ సంవత్సరం ఇప్పటి వరకు విజయవంతంగా పూర్తి చేశామన్నారు. జిల్లాలో మహబూబాబాద్, జనగామ, తొర్రూర్, హనుమకొండకు ఆరు ప్రాంతీయ సదస్సులను లక్ష్యాలకనుగుణంగా నిర్వహించుకున్నామని చెప్పారు. 2025-26 లయనిస్టిక్ సంవత్సరానికి 320 ఎఫ్ జిల్లా గవర్నర్‌గా డాక్టర్ చంద్రశేఖర్ ఆర్య, మొదటి జిల్లా గవర్నర్‌గా క్లబ్ ఆఫ్ హనుమకొండ థౌజండ్ పిల్లర్స్‌కు చెందిన నరహరి సుధాకర్‌రెడ్డి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. కార్యక్రమంలో మల్టీపుల్ నాయకులు నరేందర్‌రెడ్డి, దీపక్ భట్టాచార్య, ఆవుల గోపాల్‌రావు, పూర్వ చైర్మన్ గోపాల్‌రెడ్డి, కన్నా పరశురాములు, ప్రస్తుత కార్యదర్శి వెంకటేశ్వర్ రావు, రాంగోపాల్‌రావు పాల్గొన్నారు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్

WANTED
★Wanted Female Marketing Executives for a Reputed Pvt. Ltd Company. Salary : 12,000/- to 20,000/-, Quli: Inter/Degree, Age: 24 to 30. Cont: 7660009009, 7036229903
NTW-000

PLOT FOR SALE
★జనగామ కలెక్టరేట్‌కు & కొత్త విమానాశ్రయం, Textile Parkకు అతి చేరువలో DTCP/RERA approved Layoutతో గజం కేవలం 5,499/-కి పొందండి with all Developmenting. Contact: 7780324073.
NT-330714

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

For Classified Ads
Please Contact...
9182777552 HANAMKONDA
9182777563
9182777961 WARANAGAL
9182777556 JAYASHANKAR BHUPALPALLY
9182777135
9182777135 MULUGU
9182777557 MAHABUBABAD
9182777565 JANGAON

## డ్యాన్స్ మాస్టర్ రమేశ్‌కు విశ్వ విభూషణ్ అవార్డు

డ్యాన్స్ మాస్టర్ రమేశ్‌కు అవార్డు అందజేస్తున్న సంస్థ సభ్యులు

కృష్ణకాలనీ, మార్చి 16 : జయశంకర్ భూపాలపల్లిలో 24 ఏళ్లుగా డ్యాన్స్ కళా రంగంలో ఉంటూ